క్లుప్తంగా

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 390 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 570 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వివరించారు.

చిన్నారులకు పండ్లు పంపిణీ

వీపనగండ్ల: మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న చిన్నారులకు ఆర్‌ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పండ్లు, వాటర్ బాటిళ్లను వితరణ చేశారు. డా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినం సందర్భంగా విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత పదవులు పొందాలని ఆశిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఫౌండేషన్ సభ్యులు తోలు రామకృష్ణ, మీసాల రాజశేఖర్, రవివర్మ, విష్ణు, గడ్డమీది ఎల్లేష్, చింటులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గొంది భాస్కర్‌రెడ్డి తండ్రి గొంది గోపాల్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి శనివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య నాయుడు, గోపాల్‌రెడ్డి, నాయకులు రమేష్ రెడ్డి, బలవర్ధన్‌రెడ్డి, తిరుపతియాదవ్, తిరుపతయ్యనాయుడు, గోపాల్, నవీన్‌రెడ్డి ఉన్నారు.

చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జీఎస్ గోపి



అమరచింత: పట్టణానికి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్, సీపీఎం మండల కార్యదర్శి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జీఎస్ గోపి చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధానకార్యదర్శిగా బొంతు రాంబాబు ఎన్నికైనట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. ఖమ్మం జిల్లా మల్లేపల్లిలో శనివారం జరిగిన చెరుకు రైతుల రాష్ట్ర సదస్సులో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 13 మందితో కార్యవర్గం ఏర్పాటైందన్నారు. ప్రజా, రైతు సమస్యలపై నిరంతరం పోరాడుతున్న గోపికి రాష్ట్ర కమిటీలో సముచిత స్థానం కల్పించడం హర్షణీయమన్నారు.

మహిళల సమస్యలపై పోరాటం : ఐద్వా

పాన్‌గల్: తమ సమస్యలపై పోరాడేందుకు మహిళలు సంఘటితంగా ముందుకు రావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు గద్వాల సాయిలీల అన్నారు. శనివారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, హింసకు వ్యతిరేకంగా ఈ నెల 25 నుంచి డిసెంబర్ 9 వరకు మండలం, గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకోవాలని సూచించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో నిత్యావసర సరుకుల ధరలు పెరిగి మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధరలు నియంత్రించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆమె డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలను ఇబ్బందులకు గురి చేస్తోందని.. పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనపు బస్సులు నడపాలని సూచించారు. మహిళలకు ఇచ్చిన మిగతా హామీలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకురాలు పావని, పద్మ, ఈశ్వరమ్మ, పార్వతమ్మ, సుజాత, కృష్ణమ్మ పాల్గొన్నారు.

వసతులపై పరిశీలన

వీపనగండ్ల: గతంలో మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలను కొత్తకోట పట్టణంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలను తిరిగి వీపనగండ్ల మండల కేంద్రంలోనే కొనసాగించాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు గతంలో వినతిపత్రం అందజేశారు. పాఠశాల కొనసాగింపు విషయమై శనివారం అధికారులు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యవసాయ గోదాంను పరిశీలించారు. పాఠశాలలో అవసరమైన వసతుల ఏర్పాటుకు సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కృష్ణమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు స్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.



నాణ్యమైన భోజనం అందించాలి



అమరచింత కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీపీఓ సురేష్‌కుమార్

అమరచింత: ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి, డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కేజీబీవీతో పాటు ప్రభుత్వ ఎస్సీ వసతి గృహాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీపీఓ సురేష్‌కుమార్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా మాగనూర్‌లో జరిగిన ఘటన జిల్లాలో ఎక్కడా జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. అమరచింత ఎస్సీ వసతి గృహంలో పూర్తి స్థాయిలో కంపౌండ్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వార్డెన్ చంద్రన్ డీపీఓకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ భాస్కర్ సింగ్ ఉన్నారు.

గోపాల్‌పేట: వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహారంలో క్రమం తప్పకుండా మెనూ పాటించాలని జెడ్పీ సీఈఓ యాదయ్య సిబ్బందికి ఆదేశించారు. శనివారం ఆయన రేవల్లి కస్తూర్బాను తనిఖీ చేశారు. వంటి గదిలో ఉంచిన కూరగాయలు, ఆయిల్, బియ్యం, వండిన కూరలను, పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరీశ్ ఉన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎస్సీ హాస్టల్, తెలుగు, ఇంగ్లిష్ మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాలలను ఆయన సందర్శించారు. వంట గదులు, కూరగాయలు, మరుగుదొడ్లు, స్టోర్ రూంలు, కిరాణ సామాన్లు తదితర వాటిని పరిశీలించారు.

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని డీపీఓ సురేష్, తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బాలకిష్టాపూర్‌లోని కస్తూర్బా పాఠశాలను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 350మంది విద్యార్థినులు ఉన్నారని, సరిపడా తరగతి గదులు, వరండా లేదని అదనపు తరగతి గదులు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సునీత ఉన్నారు.

పాన్‌గల్: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి, ఆకునోనిపల్లెతండా ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివుడు, సీఆర్పీలు గోవింద్‌నాయక్, మూర్తి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర హాస్టల్ తనిఖీ

మదనాపురం: కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లికార్జున్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా స్టోర్‌లో కిరాణా సామాన్లు, బియ్యాన్ని పరిశీలించి వాటి గడువు తేదీలను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డెన్ బెనర్జి ఉన్నారు.

విద్యార్థినులతో సహపంక్తి భోజనం



వనపర్తి: స్థానిక మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వంట గదిని, సామగ్రిని ఆయన పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను చూసి తన సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించాలని, మెనూ ప్రకారం.. భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హవేలారాణి, మైనారిటీ శాఖ సిబ్బంది లోకేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మదనాపురం ఎస్సీ హాస్టల్‌లో..



రేవల్లిలో జెడ్పీసీఈఓ యాదయ్య



ఆత్మకూర్ కేజీబీవీలో..

‘ప్రజాపాలన’ విజయోత్సవాలు నిర్వహిద్దాం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

పెబ్బేరు రూరల్: కాంగ్రెస్ అధికారం చేపట్టిన 11 నెలల్లో 12 పథకాలు అమలు చేసిందని, ఈ విజయాలను గుర్తు చేసుకుంటూ వార్షికోత్సవ సంబరాలు, ర్యాలీల్లో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విడతల వారిగా పథకాలను అమలు చేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కారుపాకుల వెంకట్రావు యాదవ్, మన్యం, సూగురు రాజశేఖర్‌గౌడ్, చంద్రశేఖర్, పబ్బా విజయవర్ధన్‌గౌడ్, రణధీర్‌రెడ్డి ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మికుల ధర్నా

పాన్‌గల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు సంబంధించిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము మాట్లాడుతూ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఉద్యోగులకు రెగ్యులర్‌గా అందుతున్న వేతనాల మాదిరిగానే కార్మికులకు వేతనాలు అందించాలన్నారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయం సూపరింటెండెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో సుగ్రీవుడు, నాగన్న, తిరుపతయ్య, రాజు, రంగస్వామి, చందు, నాగులు, గోవింద్, సక్రూనాయక్, శారద, శాంతమ్మ, ఎల్లమ్మ, భాగ్యమ్మ, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏరియర్స్ ఇవ్వాలంటూ..

అమరచింత: మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్ వెంటనే చెల్లించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శనివారం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీంకు అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎస్ రమేష్, యూనియన్ అధ్యక్షుడు ప్రభాకర్, హరికృష్ణ, సునీల్, రాజశేఖర్, చిన్న, తిప్పన్న, రవీందర్, మహేందర్, శ్రీను, ఖతాల్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

వనపర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆశావర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధ జిల్లా కార్యదర్శి సునీత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 15 నుంచి 31 వరకు బస్సు యాత్ర నిర్వహిస్తున్నారని, ఈ యాత్రను జయప్రదం చేయాలని ఆశావర్కర్లు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మంజుల, జ్యోతి, చెన్నమ్మ, సంతోష, కమల, స్వప్న, సునీత, కాంచన, చంద్రకళ పాల్గొన్నారు.

సారా విక్రయాలు అరికట్టండి

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మున్సిపల్ కేంద్రంలో సారా విక్రయాలు జోరందుకుంటున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని డీవైఎఫ్ఐ నాయకుడు చంటి తెలిపారు. పట్టణంలోని పెద్దపీర్ల మసీదు, రాజావలీ దర్గా పరిసరాల్లో నిత్యం తాగి పారేసిన సారా ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయన్నారు. చుట్టపు చూపుగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నామని తండాలకు వెళ్లడంతోనే సరిపెడుతున్నారని ఆరోపించారు. ఉదయం ఐదు గంటల నుంచే సారాకు బానిసవుతూ యువకులు సైతం తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అధికారులు స్పందించి పట్టణంలోని పానీపూరి సెంటర్, టీ పాయింట్ సమీపంలో చాటున జరుగున్న సారా విక్రయాలను అరికట్టాలని కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తకోట రూరల్: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి కొత్తకోట మండలం ముమ్మళ్లపల్లి జాతీయ రహదారి 44పై చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు అమడబాకుల గ్రామానికి చెందిన ఎర్ర బాలస్వామి (60) ముమ్మళ్లపల్లిలో ఉన్న బంధువులను కలిసేందుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వనపర్తి మార్చూరీకి తరలించామన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేఎల్ఐ డీ6 కాల్వలో శవం

గోపాల్‌పేట: కేఎల్ఐ డీ6 కాల్వలో శవం గుర్తించి కేసు నమోదు చేశామని రేవల్లి ఎస్ఐ రాము తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రేవల్లి మండలంలోని తల్పునూరు సమీపంలో ఉన్న కేఎల్ఐ డీ6 కాల్వలో శనివారం శవం ఉందని సమాచారం అందుకున్న రేవల్లి పోలీసులు.. కాల్వ వద్దకు చేరుకుని శవాన్ని బయటకు తీశారు. అనంతరం వివరాలు సేకరించగా నాగర్‌కర్నూల్ జిల్లా గుడిపల్లికి చెందిన పాలసాని పెద్దబంగారయ్య(68)గా గుర్తించారు. గురువారం గుడిపల్లి సమీపంలో కాల్వలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసిందని పోలీసులు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు ఉన్నాయని పెద్దబంగారయ్య కుమారుడు పాలసాని కాశీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

సమయానికి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులకు సమయపాలన ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయించేలా వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని కేతేపల్లి సబ్ సెంటర్‌ను డాక్టర్ సందర్శించి వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణుల చేస్తున్న వైద్య పరీక్షలపై ఆయన ఆరా తీశారు. చిన్నారులను అంటు వ్యాధుల నుంచి కాపాడేందుకు వ్యాధి నిరోధక టీకాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవడంపై సిబ్బంది వారికి అవగాహన పెంచాలన్నారు. పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్యను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ తారాశశాంక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, అసిస్టెంట్ శ్రీలక్ష్మి ఉన్నారు.

గోడ కూల్చివేత

వనపర్తి టౌన్: జములమ్మ ఆలయానికి అడ్డుగా పుర కార్యాలయం లోపల ఉన్న గోడ నిర్మాణాన్ని శనివారం స్థానికులు కూల్చివేశారు. జిల్లా ఏర్పాటు సమయంలో పుర కార్యాలయాన్ని ఎస్పీ కార్యాలయం ఏర్పాటుకు ఇవ్వడంతో భద్రత దృష్ట్యా జములమ్మ రోడ్డులో కాంపౌండ్‌వాల్ నిర్మించారు. ఎస్పీ కార్యాలయం మార్పు తర్వాత రోడ్డుకు అడ్డుగా ఉన్న గోడను తొలగించాలని స్థానికులు అధికారులకు విన్నవించారు. కౌన్సిలర్ భువనేశ్వరి కొన్ని నెలల క్రితం గోడను తొలగించాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసినా.. పుర అధికారులు నిర్లక్ష్యం వహించడంతో శనివారం మెకానిక్ శ్రీను, మాజీ కౌన్సిలర్ నందిమల్ల శ్యామ్, బచ్చు రాము తదితరులు స్థానికులతో కలిసి గోడను జేసీబీ సాయంతో తొలగించారు.

వాల్‌పోస్టర్ విడుదల

వీపనగండ్ల: మాలల హక్కుల పరిరక్షణ కోసం వచ్చే నెల 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు జెట్టి వెంకటస్వామి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ మద్దిలేటి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహనీయుల విగ్రహాల ఎదుట హైదరాబాద్‌లో జరుగనున్న సింహగర్జన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా మోజర్ల రామేశ్వర్‌రావు, కోకన్వీనర్‌గా బిజ్జ విజయ్, కోఆర్డినేటర్‌గా నరేష్, నాగముని, చిన్ని కృష్ణ, గంగన్న, వీరయ్య, శ్రీనివాసులు, అడ్వైంచర్లుగా జెట్టి సూర్య నారాయణ, రవీందర్ దాసు ను ఎన్నుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గోపాల్‌పేట: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకుని కేసు నమోదు చేశామని రేవల్లి ఎస్ఐ రాము తెలిపారు. శనివారం కొంకలపల్లి నుంచి నాగర్‌కర్నూల్ వైపు ఇసుక ట్రాక్టర్ వెళ్తుండగా రేవల్లి పెట్రోల్ బంకు వద్ద ఇసుక తరలింపునకు సంబంధించిన అనుమతి పత్రాలు చూపించాలని పోలీసులు కోరారు. ఎటువంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి ఓనర్ భాస్కర్‌గౌడ్, డ్రైవర్ మహేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా చెరుకు ట్రాక్టర్ బోల్తా



రోడ్డుపై అడ్డంగా బోల్తా పడిన చెరుకు ట్రాక్టర్

కొత్తకోట రూరల్: ఆత్మకూర్ వైపు నుంచి కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ శుక్రవారం తెల్లవారుజామున కొత్తకోట సమీపంలో జూనియర్ కళాశాల వద్ద బోల్తా పడింది. దీంతో చెరుకు, ట్రాక్టర్ ట్రాలీ రోడ్డు అడ్డంగా పడటంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెరుకు ట్రాక్టర్లు పట్టణం లోపలి నుంచి వెళ్తుండటంతో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని, చెరుకు ట్రాక్టర్లను రాత్రి వేళలో పంపిస్తే ఇబ్బందులు ఉండవని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైవే పక్కన ఉన్న సర్వీస్ రోడ్డును బాగు చేస్తే ట్రాక్టర్లు లోపలికి రావని ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు, సంబంధింత అధికారులు హైవే అధికారులతో మాట్లాడి సర్వీస్ రోడ్డును బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలి



గోప్లాపూర్‌లో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

వనపర్తిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పురుషోత్తంరెడ్డి డిమాండ్ చేశారు. వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని శనివారం ధర్నాచౌక్‌లో చేపట్టిన రిలే నిరహార దీక్షలకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటేష్, పట్టణాధ్యక్షుడు బచ్చు రాము, ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, రాయన్న, వీహెచ్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు అందించే పింఛన్ రూ. 6 వేలకు పెంచాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం గోప్లాపూర్ జీపీ ఎదుట నిరసన తెలిపి గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ, బంగారయ్య, బాలరాజు, మురళీ, లక్ష్మయ్య, కుర్మయ్య, స్వామి, నారాయణ, సాయిలు, ఇంద్రమ్మ ఉన్నారు.

మదనాపురం: దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ రూ.6వేలకు పెంచాలని మండలంలోని అజ్జకొల్లులో దివ్యాంగుల గ్రామ అధ్యక్షుడు పరుశరాములు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో చెన్నయ్య, సంతన్న, కొండన్న, బాలచంద్రయ్య, శివమ్మ, ఆంజనేయులు, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో రైతులు మోసపోవద్దు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం మార్కెట్ యార్డ్ చైర్మన్ పి.ప్రశాంత్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న బోనస్ పొందాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారెడ్డి, బీచుపల్లి యాదవ్, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, గుంత రమణ, యాదగిరి, సాయిల్‌గౌడ్, కోటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య గౌడ్, నాగేశ్వర్ రెడ్డి, వెంకటన్న, మంద కన్న తదితరులు ఉన్నారు.

వ్యవసాయ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి

ఆత్మకూర్: వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు జీవన భృతి వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని జూరాల గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 60 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అందులో 85 శాతం చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని వివరించారు. వ్యవసాయంపై ఆధారపడ్డ కూలీలకు పనులు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందులో మహిళా కార్మికులే అధికంగా ఉన్నారని తెలిపారు. వ్యవసాయప నులకు అలవాటు పడ్డ కార్మికులు ఇతర పనులు చేయలేకపోతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశన్నంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీలకు జీవనభృతి ఇవ్వడంతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని, ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, సూరి, సత్యన్న, మన్యం, వెంకటన్న, వ్యవసాయ కూలీలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంత్యుత్సవాలు



వనపర్తిలోని సాయిమందిరంలో భక్తుల పూజలు



ఆత్మకూర్‌లో..

వనపర్తిటౌన్: పరులకు చేసే సేవతోనే జీవితానికి సంతృప్తి కలుగుతుందని తెలుగుభాషా సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీనివాసులు, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రమేష్‌రెడ్డి అన్నారు. శనివారం భగవాన్ శ్రీశ్రీ సత్యసాయి బాబా 98వ జయంత్యుత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించడంతో పలువురు భక్తులు రక్తదానం చేశారు. ఆలయానికి వచ్చే నిరుపేదలకు మెడికల్ క్యాంపు నిర్వహించి వైద్య పరీక్షలు చేసి, తగిన మందులను అందించారు. నిరుపేద ప్రజలకు, వృద్ధులకు దుప్పట్లు, చీరలను పంపిణీ చేశారు. ఉదయం నుంచే ఆలయంలో బాబా విగ్రహానికి, గణపతి, గాయత్రి, శ్రీరామ చంద్రమూర్తుల విగ్రహామూర్తులకు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి బాబా భజన కీర్తనలతో సాయి మందిరం హోరెత్తించారు.


ఆత్మకూర్: భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను శనివారం ఆత్మకూర్‌లోని సాయి మందిరంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 5గంటలకు జ్యోతులచే ఓంకార సుప్రభాతములతో మహానగర సంకీర్తన ర్యాలీని పురవీధుల గుండా నిర్వహించారు. ఉదయం 6.30గంటలకు సర్వధర్మ పతాకావిష్కరణ, 9గంటలకు బాబా వారి వ్రతకల్పం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆత్మకూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు వై తిప్పారెడ్డి, అశోక్‌రావు, వేణుగోపాల్, రఘు, రమేష్, నీలేష్, ముక్తేశ్వర్, రామక్రిష్ణ, రవీందర్‌రెడ్డి, నవీన్, నాగరాజు, శ్రీవాణి, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు

సాక్షి, నెట్‌వర్క్: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయాన్ని సాధించడంతో జిల్లావ్యాప్తంగా బీజేపీ శ్రేణులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ 288 స్థానాలకు గాను ఎన్‌డీఏ కూటమి 222 స్థానాలను గెలుచుకొని కొత్త చరిత్రను సృష్టించిదన్నారు. ఇండియా కూటమి 40స్థానాలతో సరిపెట్టుకుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి కొల్లాపూర్ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్‌రావు, వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణ, భరత్‌భూషణ్, ఆర్మీ బాలస్వామి, ధారాసింగ్, జగ్గారి శ్రీధర్‌రెడ్డి, బుచ్చిబాబుగౌడు, విక్రం తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు బాధ్యతలను పెంచుతాయి



వనపర్తి విద్యావిభాగం: అవార్డులు బాధ్యతను రెట్టింపు చేస్తాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య అన్నారు. ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ఎకనామికల్ అండ్ సోషల్ రిఫార్మ్స్ రాయల్ అకాడమీ బ్రాంప్టన్ కెనడా యూనివర్సిటీ సంయుక్తంగా బెంగళూరులో గతవారం స్కాలర్స్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని ఔట్‌స్టాండింగ్ అకాడమిక్ ఎక్సలెన్స్ నేషనల్ అవార్డుతో సత్కరించించారు. ఈ సందర్భంగా వనపర్తిలోని స్కాలర్స్ కళాశాల ప్రాంగణంలో డాక్టర్ పి.జగదీశ్వర్, డాక్టర్ జీవర ప్రసాదరావు, డాక్టర్ ఎల్.సత్యనారాయణరెడ్డి, బి.నాగేశ్వర్‌రెడ్డి ని ఇంటర్ బోర్డు జిల్లా అధికారి అంజయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ.శ్రీధర్, మధుసూదన్ గుప్తా, నాయకంటి నరసింహశర్మ, విజయ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.